# ఓలమ్మో, పోలీసు మంచోడే !

తాను పుట్టి పెరిగిన ఊరది. తనొక్కడేనా తన తాతల కాడ్నించీ అక్కడే పుట్టారు, అక్కడే పెరిగారు; అక్కడే మట్టయిపోనారు. ఐతేనేం? మరి పోలీసుకా వూళ్ళో ఉండ బుద్ధెయ్యడంలేదు. ఎంత కష్టపడిచేసినా రోజంతా గడిచేసరికి తమ ముగ్గురు ప్రాణాలకి కూడు దొరకడంలేదు !

ఏదైనా బస్తీకిపోతే; ఏదో ఒక పని చేసుకోవచ్చు. పుట్టినకాడ్నించి పెందుర్తిలో పెరిగితేనో— తన్నా వూరేం రక్షించిందని? లేకలేక పుట్టాడన్న మాటేగాని తండ్రి తన కేమన్నా గారాంచేశాడా, ఏడాది దాటకుండా సచ్చిపోనాడు! "మీ బాబు ఏఁరా ఈరాసాఁవి మంచోడురా, మేవిద్దరం ఇడిసిపెట్టకుండా తిరిగేవోళ్ళం!' అంటాడు అప్పలకొండ! ఆడికి తానంటే ప్రాణమే! ఐతే ఏం జరిగింది?

ఓలమ్మో, పోలీసు మంచోడే!

తల్లి అప్పలమ్మ పనులకాలంలో ఏదో పనికి పోతూనే ఉండేదా? పునాస గడిస్తే పనులేం సచ్చాయ్? గడ్డిగోకి బుంగనిండా కూరుడు నేది! ఊరంట పోయి అమ్ముకొనేది. బుగతగారింటో అంట్లు తోమేది. ఎలాగోలా కష్టపడి తన్ను పెంచింది. తనకి ముందో— పాపం ముగ్గురు నలుగురు పుట్టినా రంట! ఒక్కడూ దక్కనేదంట; యిప్పటికీ తలుసుకుని ఏడుత్తా వుంటుంది. అందుకే తనకి పోలీసు అని పేరు పెట్టుకుందట!

పోలీసయినా, లేకలేక పుట్టాడుగందా అని అబ్బరంగా పెరిగాడా ఏమన్నానా? ఈడొచ్చినికాడ్నించి పనిపాటలకి పోతూనే ఉన్నాడు. రెక్కలు ముక్కలు చేసుకుంటూనే వున్నాడు. సంపాదించుకుంటూనే వున్నాడు. అందులోకీ ఎదవ కరువుకాలం దాపురించింది. ఎంతచేసినా కడుపునిండదు.

తను దూరడానికో సందులేదు కాని తన మెడకోడోలు! చింతాలును తీసుకొచ్చి పెళ్ళిచేసిందమ్మ! ఏమాటకామాటే చెప్పాలి చింతాలైనా చెడ్డదేమీ కాదు. కష్టపడి పనిచేసి యింటికొచ్చేసరికి, ఎచ్చఎచ్చని నీళ్ళుకాచి, ఎన్నుమీద పోస్తుంది. ఈపు రుద్దుతాది. గోముగా తలదువ్వుతుంది. నిజానికి చింతాలు లేకపోతే తన బ్రతుకేంగాను! ఏడాది నుంచి అప్పలమ్మ రోగిస్టిదై పోనాది. చింతాలు సిన్నదైనా ఉన్నకాడికి కాచి బాగానే యీడుచుకొస్తోంది సంసారం!

ఐతే మాత్రిం ఈ కరువు కాలంలో బ్రితకడం ఎలాగా అని! ఎదవ రూపాయి డబ్బులిస్తే తవ్వెడు గింజలుకూడా రావడంలేదు. పైగా తాను పుట్టి పెరిగినఊళ్లో కరువు మండి పోతున్నాది. గంటెలు, చోళ్లూ పండడమే గగనమై ఊరుకుంది. ఎక్కడిన్నించో తునాతలనించి సైకిళ్ళమీద బియ్యం తెచ్చి దొంగతనంగా అమ్ముకునేవోళ్ళు రూపాయికి తవ్విడ్నరసోల డైనా పోయడంలేదు. చింతాలు విసవిసలాడిపోతోంది!

కాకినాడలో బియ్యం కారుసౌకంట! ఆమద్దిల ఎంకట సామిగాడు సెప్పలేదా? ఎంకటసామి సెప్పింది అక్షరాలా నిజమనుకున్నాడు పోలీసు. తనకా ఒంట్లో శక్తిఉంది. ఎక్కడ పనిచేస్తే ఏముంది? పొట్ట గడవకపోదని నమ్మాడు పోలీసు! అక్కడికిపోతే గింజలకోసం కటకటలాడే గతి తప్పొద్దిగందా అనుకున్నాడు.

ఆ వూసే రాత్రి తల్లినీ, చింతాలునీ దగ్గరకు పిలిచి చెప్పాడు. తాను ముందుగా కాకినాడ ఎళ్తానన్నాడు. పనీ గినీ చూసుకుంటానన్నాడు. ఎక్కడేనా కొంప ఎదికి ఆళ్ళిద్దరినీ తీసుకుపోతాననీ చెప్పాడు. ఉన్న పదిరూపాయలతోనూ రోజులు గడుపుకోమన్నాడు. అప్పలమ్మ ఒకపట్టాన ఒప్పుకో లేదు. కంటతడి పెట్టింది. "పుట్టినూరిడిసిపెట్టి యాడికిపోతాంరా" అంది. ఎలాగోలా కష్టపడితే ఈడనే బ్రితకలేకపోతాంరా? ఐనా చింతాలు ఈడేరి కాపరానికివచ్చి యాడాదే గదరా అయింది! అప్పుడే దాన్నిడిసిపోతే ఎలారా?" అంది.

అత్తమ్మ ఆ మాటఎత్తితే— చింతాలెందుకో సిగ్గు పడింది. ముసిముసి నవ్వులు నవ్వింది. "అదేవిటే అత్తమ్మా! ఏడకో ఆడికి ఎల్లకపోతే కొంపెట్టాగడుత్తాదీ?" అంది. "నిజ మేనే అమ్మా మరి! సింతాలు సిన్నదైనా ఎంత దైర్నంగా సెప్పిందో సూడు!" అన్నాడు పోలీసు. తల్లి ఒల్లకుంది. "ఏమోనయ్యా మరి! నాకేటి తెలుత్తాది? నీ ఇట్టం!" అంది అప్పలమ్మ.

మొత్తానికా రాత్రి......ఎంతసేపని కిందా మీదా పడితేనేంగాక! ఆలోచించగా ఆలోచించగా దారి దొరికింది. తెల్లారుజామునే బయల్దేరి అనకాపల్లి పోవాలి. ఆడ రైలెక్కాలి. కాకినాడ పోవాలి! నిశ్చయించుకున్నాడు పోలీసు.

అత్తమ్మ ఎదురుగుండా చింతాలు అంత ధైర్యంగా చెప్పిందేగాని, ఆ మాపు పోలీసుని చుట్టేసుకుని లబ్బోదిబోమంది "అయ్యో...మావోఁ" అంటూ ఒక్కటే రాగాలు పెట్టింది. "అదేటే— ఎర్రిమొగఁవా? నువ్వు మళ్లీ అట్టగంటే నేను దైర్నంగా ఎళ్ళగలనంటే?" అన్నాడు పోలీసు, చింతాలు కన్నీళ్ళు తుడుస్తూ. తనూ కంట నీరెట్టుకున్నాడు.

కొంజాల్లో తల్లి పడుకుని ఏడుస్తోంది. తాను వెళ్ళి చూళ్ళేదుకాని, అప్పుడప్పుడు ఉస్సురుస్సురుమంటూ చప్పుళ్లు వినబడుతున్నాయి. తల్లి తెల్లవార్లూ నిద్రపోయినట్లే లేదు. మంచంమీద అటూ యిటూ ఒత్తిగిలుతూనేవుంది. ఒక్కి—

మంచం కిర్రుకిర్రుమంటూనే వుంది. నిజానికి తనూ, చింతాలూ నిద్రపోయారా ఏమన్నానా? "కాసేపు నిద్రపోవే" అని తానంటే "ఇంకేం నిద్రలే మాఁవా? ఈ మాపేగదేంటి?" అంటుంది చింతాలు. తనూ ఏమీ మాట్లాడలేదు.

తాను కాకినాడపోయి ఏవో సౌఖ్యసుకాలు అనుభవించ గలనన్న ఆశ వాడి మనసులో పలి మనసులో తారట్లాడకపోలేదు. తీయని కలలో కదలాడకపోలేదు. దిగులు పడుతున్న అమ్మనీ, చింతాలునీ ఒంటరిగా విడిచిపెట్టి, ముక్కూ మొగమూ తెలీని ఊరికి పోవడం బాధగానేఉంది పోలీసుకి. ఎందుకో తెలియదు. గుండె బెంగగా గుబగుబలాడుతోంది. ఐనా తప్పేదేముంది? తాను కాకినాడ వెళ్ళాలి! కష్టపడి పన్చెయ్యాలి! సంపాదించాలి. నాలుగు డబ్బులు ఎనకేసుకోవాలి. నీరసించిపోతున్న అమ్మకి మంచి మందులిప్పించాలి! చింతాలుకు మంచి మంచి చీరలు కొనాలి! "ఆవేళ తను సూళ్లేదూ? బుగతగారమ్మాయి సుశీలమ్మ కట్టుకోలేదూ? మెరిసిపోతోంది! అలాంటి సీర కొనాలి! పెళ్ళికి అమ్మ. నాను చేయించి పెట్టింది. అదొక్కటే ఏఁబాగుంది? సింతాలుకు మరోటి చేయించాలి!" పోలీసు మనసు పరిపరివిధాల ఆలోచిస్తూనేవుంది. చింతాలుకూడా వాడి గుండెలమీద చేతులు రాస్తూ ఎన్నెన్నో ఊసులు చెప్పింది. మొత్తానికి ఆ రాత్రి ఎంతో హాయిగా యిట్టే గడిచిపోయింది.

## ఓలమ్మో, పోలీసు మంచోడే!

తొలికోడి కూసిందో లేదో పోలీసు లేచాడు. ఉన్న రెండు చొక్కాలూ ఒక సంచిలో పెట్టింది చింతాలు. ఆరు రూపాయలు కూడా యిచ్చింది. పోలీసు మొగం కడుక్కొని బట్టలు వేసుకొన్నాడు. "అమ్మా నేనెల్లివత్తానే!" అన్నాడు. "అయితే తప్పదేంట్రా?" అంది అప్పలమ్మ! "అదేంటమ్మా.. దైర్యంగా పంపాలకాని!..." అన్నాడు పోలీసు.

"ఏం దైర్యంరా బాబూ!" అంది అప్పలమ్మ. అంటూనే బావురుమంది. వెక్కి వెక్కి ఏడ్చింది.

"అదేంటమ్మా! నువ్వలా ఏడిస్తే ఎలాజెప్పు?" అన్నాడు పోలీసు. వాడి గొంతు ముడిపడింది. పొద్దెక్కుతు పోయింది. భుజంమీది తువ్వాలుతీసి తల్లి కళ్ళుతుడిచాడు. "ఆరవకుండా అనకాపల్లి చేరుకోవాల? మరి ఎల్లొత్తానమ్మా! ...ఒలే సింతాలూ...అమ్మ నెలా సూసుకుంటావో? అంతా నీమీదే ఉన్నాది!" అన్నాడు.

"అదేమిటి మావాఁ అట్టాగంటావ్?" అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ చింతాలు!

పోలీసు బయల్దేరాడు. ఆశగా అడుగులు వేసుకుంటూ బయల్దేరాడు. పడమటేపు చంద్రుడు అస్తమిస్తున్నాడు. తూర్పున చుక్క పొడిచింది. చుక్క కాంతిగా మెరిసిపోతోంది. చింతాలు కళ్ళే జ్ఞాపకం వస్తున్నాయి. వెనక్కి తిరిగి చూశాడు. చింతాలు గుడిసె వదలి, రోడ్డుమీదికి వచ్చి అలాగేచూస్తూ

నించుంది. ఇంత దూరం సాగినా తనకింకా దీపం చూపిస్తూనే ఉంది! "ఎర్రిమొగం! ఎర్రిమొగం!" అనుకున్నాడు గోముగా పోలీసు. అలా చింతాలును చూస్తూంటే—వెనక్కి ఒక్క పరుగులో వచ్చి కౌగిలించుకుందామనిపించింది పోలీసుకి!

అయినా తప్పద్దు. ముందుకే వెళ్ళాలి. కాకినాడ వెళ్ళి డబ్బులు సంపాదించుకోవాలి. తన కష్టాలు గట్టెక్కాలి. నిశ్చయంగా నడుస్తున్నాడు పోలీస్సు. వీడిలా నడుస్తున్నాడు. అడపాతడపా వెనక్కి చూస్తూనే వుంది మనస్సు. పాదాలు వెనక్కి ముందుకీ ఆడుతూనే వున్నాయి. చింతాలు...అమ్మ! చింతాలు...అమ్మ!! చింతాలు...అమ్మ!!! చింతాలు..అమ్మ!!!!

* * *

ప్రయాణంలో ఎన్ని అవస్థలు పడ్డాడో, ఎన్నెన్ని ఆలోచనలు సాగించాడో వాడికే తెలియదు! కాకినాడ చేరుకొనేసరికి మధ్యాహ్నం మూడుగంటలైంది. కాకినాడలో అడుగుపెట్టీ పెట్టగానే వాడి బ్రతుకే మారిపోయింది. రైలుదిగి స్టీమ్మెంటు రోడ్డుఎక్కాడు. కాకినాడ వాడి మనస్సులో చిత్రాతి చిత్రంగా మెరిసిపోనారంభించింది. నడుస్తున్నాడు. ఎటునుంచి ఎటుపోవాలో తెలియదు, ఎదురుగా రిక్షావాడెవడో కనిపిస్తే అడిగాడు. అంతకన్న ఏం చేస్తాడు? చదువుకున్న మారాజుల్ని అడిగితే చెబుతారా ఏమన్నానా?

రిక్షావాడైనా తన ప్రశ్నకి సూటిగా జవాబు చెప్ప

లేదు "ఏ పూర్నించి వచ్చావ్? సంగతేమిటి" అని ఎదురు ప్రశ్న వేశాడు.

పోలీసు మనసులోనే విసుక్కున్నాడు. కడుపులో ఆకలి మండిపోతోంది. తిండి ఎక్కడ దొరుకుతుందో తెలియదు. అయినా తప్పేదేముంది. ఆగి నింపాదిగానే జవాబిచ్చాడు. కలసివచ్చినప్పుడు అదృష్టం అలాగే కలిసివస్తుంది.

'ఏపేటి? నీది పెందుర్తా? ఆడ్నే మా ఊరున్నూ! మాది సబ్బారం; తెలుసా?' అన్నాడు రిక్షావాడు. "బాగానే వచ్చావు కాని వెంటనే ఏం పనులు దొరుకుతాయి? ఏదైనా అటూ ఇటూ తిరిగి, సాయంత్రం మళ్ళీ స్టేషనుకాడకి రా!... మాపిడికి మాయింటికి తీసుకుపోతా! పనిచూసుకుందాం!" అన్నాడు రిక్షావాడు. ఎంతో దయగా చెప్పాడు. పోలీసు పొంగి పోయాడు.

సరేనన్నాడు; అలా బయల్దేరాడు పోలీసు. బయల్దేరు తున్నప్పుడు రిక్షావాడి పేరడగలేదే అన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. వెనక్కితిరిగి చూశాడు. అప్పటికే ఆడు ఎవరిదో బేరం కట్టేశాడు. జోరుగా పోతున్నాడు. ఐనా తన కేక వాడికి వినిపించింది. పిల్లా ఎంకటస్వామి అంటూ పొలికేక పెట్టాడు. పోలీసు తన పేరు చెప్పాడు. రోడ్లన్నీ తిరుగుతున్నాడు. ఒక చోట తాపీ మేస్త్రీలు, ఆడకూలీలు, మగకూలీలు పెద్దమేడ కడుతున్నారు. ఏదో పెద్దమిల్లు చప్పుడుచేస్తూ తిరుగుతోంది.

లందులో ఏటి జరుగుతోందో? ఎంతసేపు చూసినా వాడికి తెలియదు. ఎవడో ఒకతను...వంక తలపాగా చుట్టుకున్నాడు. రిస్టువాచీ పెట్టుకున్నాడు. హడావుడిగా తిరుగుతూ పనులు పురమాయిస్తున్నాడు. రోడ్డువైపు వెడుతున్నాడు. ఆడు పెద్ద మేస్త్రీ కాబోలనుకున్నాడు పోలీసు.

ఆడ్ని అడిగితే పని దొరుకుతుందేమో! దణ్ణంపెట్టి అడిగాడు. అతనడిగిన ప్రశ్నలకి జవాబు చెప్పాడు. మేస్త్రీ ఏకళనున్నాడో అతడికి పోలీసంటే సదభిప్రాయం కలిగింది.

"రేపు ఏడవకుండా ఇక్కడకు వచ్చెయి! కూలి రూపాయిన్నర తెలుసా?" అన్నాడు మేస్త్రీ; పోలీసు సరేనన్నాడు.

ఊరు చూద్దామని బయల్దేరాడు పోలీసు. "మేడలతో ఎలిగిపోతున్నాది! ఎంత పెద్ద ఊరు!" అనుకున్నాడు. కాకినాడయింత అందంగా ఉంటుందని ఎవరూ చెప్పలేదు. రోడ్లన్నీ ఎంత కీసుగా ఉన్నాయిరబ్బో! ఎన్ని మేడలు, ఎన్ని కాపులు! ఇంతమంది జనం ఉన్నారుగందా? అందరికీ పనులున్నాయా? అనుకుంటూ ఆశ్చర్యపోయాడు పోలీసు. తిరిగిన రోడ్లు తిరగకుండా రోడ్లన్నీ తిరుగుతున్నాడు.

ప్రొద్దుక్రుంకే సమయానికి వంతెన దగ్గరకు చేరుకున్నాడు. వంతెనకు తూరుపున పడవమీద సరుకు దింపుతున్నారు కూలీలు. ఎన్నెన్ని పడవలు! దగ్గరగా వెళ్ళి నించున్నాడు. హడావుడిగా పనిచేస్తున్నారు కూలీలు. చూసి చూసి

ఓలమ్మో, పోలీసు మంచోడే!

రిక్షాలు రద్దీగా తిరుగుతున్నాయి. పోలీసుకేమీ తోచింది కాదు; పిచ్చోడిలా తిరుగుతున్నాడు. ఆకలేస్తోంది. ఎన్నో డబ్బులు లేవు!

సింగిల్టీ తాగుతూంటే ఎంకటసామి జ్ఞాపకం వచ్చాడు. ఇస్టేషను కాడి రమ్మన్నాడు. ఎలాగెళ్లాలో తెలుసుకున్నాడు. గబగబా నడుస్తున్నాడు పోలీసు. ప్రతిచోటా లైట్లు వెలిగాయి. 'ఓరబ్బో పట్టం పట్టమంతా పట్టపగలై పోనాది!' అనుకున్నాడు. గబగబ నడుస్తున్నాడు.

"ఏయ్! ఆగు!" ఉరుముతున్నట్టుగా కేక వినపడింది. ఎవరు చెప్మా! తన్నెందుకు పిలుస్తున్నారో? ఆగాడు! వెనక్కి తిరిగి చూశాడు. భయంతో కొయ్యబారిపోయాడు. ఎత్తుగా పెద్దమీసాలతో పోలీసు కానిస్టేబులు భయంకరంగా కనిపించాడు. 'ఎందుకు చెప్మా పిలుస్తున్నాడు?' సందేహిస్తూ నిల్చున్నాడు.

కానిస్టేబుల్ సమీపించాడు. "ఎక్కడికిరా పరిగెడుతున్నావు? పరిగెత్తి ఎంత దూరం పోదామనుకున్నావ్?" అన్నాడు కానిస్టేబులు.

అలా ఎందుకంటున్నాడో పోలీసుకి అర్థంకాలేదు. కానిస్టేబులు అమాంతం వాడి చేయిపట్టుకున్నాడు. పోలీసుకేమీ విసిగొచ్చింది. ఆకలీ జ్ఞాపకం వచ్చింది. మళ్ళీ ఎనక మొగం పట్టాడు. అప్పటికే సినిమాల రోడ్డంతా హడావుడిగా ఉంది.

బోధపడలేదు. కానిస్టేబులు చేతిలోంచి తన చేయి లాక్కుందుకు ప్రయత్నించాడు. ఆ పని అప్రయత్నంగానే చేశాడు! కాని ఫలితం మాత్రం వాడిని బాగా క్రుంగ చేసింది!

"ఓరి ఎదవా! నా దగ్గర్నుంచే పారిపోదామనుకుంటున్నావురా!" అంటూ గదమాయించాడు కానిస్టేబుల్. నడుం విరిగేలా గుద్దు గుద్దాడు!

"లేదు బాబూ! అసలు సంగతేమిటో నాకు తెలవందే!" అన్నాడు పోలీసు ఏడుస్తూ!

"ఓరి దొంగ ఎదవా? నన్నే మాయ చేద్దాం అనుకుంటున్నావ్? నీ పేరు సుబ్బయ్య కదూ!" అని గర్జించాడు కానిస్టేబులు!

"కాదు బాబోయ్! నా పేరు పోలీసు!" అన్నాడు దీనంగా.

పోలీసు ఆర్తనాదాలు పోలీసు కానిస్టేబులుకి వినిపించలేదు. టూ టౌను పోలీసు స్టేషను సమీపించింది. పోలీసుకు బోధపడింది. కాని తనకెందుకు అన్యాయం జరుగుద్ది? అనుకున్నాడు. ఏంచేయాలో తోచలేదు. కానిస్టేబుల్ పోలీసు స్టేషను సమీపిస్తూనే అటెన్షనులో యస్సైకి శాల్యూటు చేశాడు.

"ఇదిగో సార్! పొద్దుట పారిపోయిన సుబ్బయ్య!"

"గుడ్! గూడ్! ఎముకలు విరిచి లాకప్పులో తోసె

ఓలమ్మో, పోలీసు మంచోడే!

యేంటండి వెధవని! రేపు చార్జిషీటు ఫైలుచేద్దాం!" అని హుంకరించాడు యస్సయి.

పొద్దుట పది గంటలకే సెంట్రీ దిగిన సుబ్బరామయ్య మనసులో ఏమూలో మూలుగుతున్న సందేహం ఎవరికీ వినిపించలేదు.

పెందుర్తి నులకమంచంలో మూలుగుతున్న అప్పలమ్మ గుండెల చప్పుడు ఏ ఒక్కరికీ వినిపించలేదు. పెనిమిటి గురించి లక్ష కలలతో లక్ష ఆశలతో మరో లక్ష అనుమానాలతో అత్తమ్మను సమీపించిన చింతాలు దైన్యం ఒక్కరికీ తట్టలేదు "అత్తమ్మా మీవోడక్కడ ఎవత్తెనేనా మరులుగొంటే నా గతేంకాను?" అని అడుగుతున్న చింతాలును దగ్గరకు తీసుకొని అప్పలమ్మ—"ఓసినీ అదేం మాటలే! ఓలమ్మో! పోలీసు మంచోడే నా తల్లీ!" అంటూ కన్నీళ్ళు తుడుచుకుంటున్న తల్లి వేగు ఎవరికీ కనిపించలేదు! మోచేతులతో కుమ్ముతూ మోకాళ్ళతో పొడుస్తూ, కారుకూతలు కూస్తూ పోలీసును మాత్రం లాకప్పులోకి తోసేశాడు కానిస్టేబులు. అతని పేరు పోలీసంటే ఎవరు నమ్ముతారు?

---

[ప్రచురణ ఆంధ్ర సచిత్ర వారపత్రిక 23-4-82]